క్లుప్తంగా

రామలింగేశ్వరుడిని దర్శించుకున్న సీఐ

అడ్డాకుల: మండలంలోని కందూర్ రామలింగేశ్వరస్వామిని ఆదివారం భూత్పూర్ సీఐ రజితారెడ్డి దర్శించుకున్నారు. అర్చకులు ఆమెకు స్వాగతం పలికి ప్రధాన ఆలయంలోని శివుడికి అభిషేకం చేయించారు. అనంతరం ఆమె ఆలయంలో గౌరమ్మను దర్శించుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలను అందజేసి సత్కరించారు.

బాలవర్ధన్ ఆశయాలు కొనసాగిద్దాం



జడ్చర్ల టౌన్: రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు బాలవర్ధన్ ఆశయాలు కొనసాగిద్దామని రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి.శివకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని చంద్రగార్డెన్‌లో నిర్వహించిన సంస్మరణలో ఆయన పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతోపాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రుద్రారం కల్వర్టు పనులు ప్రారంభం



నవాబుపేట: రుద్రారం సమీపంలో మహబూబ్‌నగర్ రోడ్డుపై ఉన్న కల్వర్టు పనులు ఆదివారం ప్రారంభించారు. దాదాపు రూ. 30 లక్షల వ్యయంతో కల్వర్టు, డబుల్‌రోడ్డు, సీసీ పనులు చేయనున్నారు. కల్వర్టు సరిగ్గా లేక గతంలో ఇక్కడ అనేక ప్రమాదాలు జరిగి పలువురు మరణించిన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చొరవతో పనులు చేపట్టినట్లు నాయకులు పేర్కొన్నారు.

కొమిరెడ్డిపల్లిలో వనభోజనాలు



అడ్డాకుల: మూసాపేట మండలంలోని కొమిరెడ్డిపల్లిలో ఆదివారం గ్రామస్తులు వనభోజనాలకు వెళ్లారు. వర్షాలు కురవాలని కోరుతూ కార్యక్రమం నిర్వహించారు. చెట్ల కిందనే భోజనాలు చేశారు. సాయంత్రం వరకు పొలాల వద్దే గడిపారు. ఊర్లోకి ఎవరు వెళ్లకుండా గ్రామసేవకులు కాపలా కాశారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

జడ్చర్ల: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య సూచించారు. ఆదివారం జిల్లా ఫుట్‌బాల్ కమిటీ ఆధ్వర్యంలో బాదేపల్లి జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఉమ్మడి జిల్లా 16 ఏళ్ల బాలికలకు సంబంధించిన పోటీలను ఆయన ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా టీం కోసం కొరకు పోటీలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, కౌన్సిలర్ రఘురాంగౌడ్, జిల్లా ఫుట్‌బాల్‌కమిటీ కార్యదర్శి గజానంద్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



పాలమూరు: లయన్స్ క్లబ్ ఆఫ్ పాలమూరు 2023–24సంవత్సరానికి సంబంధించిన నూతన కార్యవర్గాన్ని ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గిరిప్రసాద్‌రెడ్డి, కార్యదర్శిగా మహేందర్‌రెడ్డి, కోశాధికారిగా బాలరాజుతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. వారితో రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మల్టీపుల్ డిస్ట్రిక్ జీఎంటీ కో–ఆర్డినేటర్ మనోజ్ పురోహిత్ మాట్లాడుతూ లయన్స్ ఇంటర్‌నెషనల్ సంస్థలో భాగంగా చేస్తున్న సేవలను మరింత విస్తరించాలన్నారు. క్లబ్ అంటేనే సేవకు ప్రతిరూపంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జనార్దన్, గోవర్ధన్, ప్రసాద్, శ్రీహరి, ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

అడుగడుగునా సమస్యలే..

- కనిపించని నూతన డ్రైయినేజీలు
- దెబ్బతిన్న సీసీరోడ్లు
- మేకలబండ, మేతర్‌వాడలో అన్నీ సమస్యలే
- శివశక్తినగర్‌లో సగం రోడ్లు అస్తవ్యస్తం
- తెలుగుగేరిలో 150 ఇళ్లకు అందని 'భగీరథ'

23వ వార్డులో జనాభా: 5,864
ప్రధాన వీధులు: మేకలబండ, శివశక్తినగర్ (కొంత భాగం), తెలుగుగేరి, దోబీవాడ, మేతర్‌వాడ



హసన్‌నగర్‌లో ధ్వంసమైన సీసీరోడ్డు



దోబీవాడలోని ఓ గల్లీలో పరిస్థితి ఇలా ..

వార్డ్ వాచ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని 23వ వార్డులో సమస్యలు కొలువుదీరాయి. దోబీవాడలో సుమారు 500 ఇళ్లు ఉంటాయి. చిన్న చిన్న గల్లీలు, డ్రైయినేజీల నిర్వహణలో లోపాలు తదితర సమస్యలు స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. దుర్గంధం వెదజల్లుతోంది. ఎక్కడా కొత్తగా డ్రైయినేజీ ఏర్పాటు చేయలేదు. ఎక్కడికక్కడ సీసీరోడ్లు దెబ్బతిన్నాయి. కొత్త కమ్యూనిటీ హాలు



హసన్‌నగర్‌లోని డ్రైయినేజీలో పేరుకుపోయిన చెత్త

ఎదురుగా మెయిన్ రోడ్డుకు ఇటువైపు ఉన్న తెలుగుగేరిలోని రెండు, మూడు గల్లీలలో ఇంకా మిషన్ భగీరథ పథకం పైపులైన్ ఏర్పాటు చేయలేదు. దీంతో సుమారు 150 ఇళ్లకు తాగునీరు అందడం లేదు. కనీసం సమీపంలోని పవర్ బోరునైనా మరమ్మతు చేయించి పాత మినీ ట్యాంకు నింపాలని స్థానికులు కోరుతున్నారు. సీసీ రోడ్లు ఉన్నా డ్రైయినేజీలు నిర్మించకపోవడంతో పాత డ్రైయినేజీలే దిక్కయ్యాయని చెబుతున్నారు. కొందరు ఇంటి వాకిళ్లు ఊడ్చివేసి చెత్తను పక్కను డ్రైయినేజీలో వేస్తుండడంతో మురుగు పేరుకుపోయి దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. కొన్ని నెలల క్రితం మెయిన్ రోడ్డు నుంచి చింతబాయి శ్మశానవాటిక వరకు సీసీరోడ్డు నిర్మించినా డ్రైయినేజీని మాత్రం ఏర్పాటుచేయలేదు. శివశక్తినగర్ కమాన్ నుంచి లోపలికి వెళ్తే కుడివైపు అంతా లోతట్టు ప్రాంతమే. చాలా వరకు పాత ఇళ్లు గజిబిజిగా ఉన్నాయి. చిన్న గల్లీలలో పాత డ్రైయినేజీలే ఉండడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. చింతల బాయి వీధి చివరలో సగం వరకు మట్టిరోడ్లే ఉన్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఆ పక్క నుంచి తరచూ పెద్దకాల్వ పొంగి పొర్లి చుట్టుపక్కల ఇళ్లవరకు వరద, మురుగు కలిసి రావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. హసన్‌నగర్‌లో అన్నీ సమస్యలే నెలకొన్నాయి. ఇక మేకలబండ, మేతర్ గల్లీ మురికివాడలుగా మారాయి. అసలే చిన్న చిన్న గల్లీలు, ఆపై ఇటీవల మిషన్ భగీరథ పైపులైన్ కోసం ఫర్లాంగ్ దూరం సీసీరోడ్డును తవ్వి సరిగా పూడ్చలేదు. దీంతో నడవడానికి కూడా ఇబ్బందులే ఎదురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అప్పట్లో మేతర్‌గల్లీలో నిర్మించిన మినీ వాటర్ ట్యాంకులు వృథాగా ఉన్నాయి. పవర్ బోరు నుంచి కనెక్షన్ ఇచ్చి వాటిని నింపితే బాగుంటుందని విజ్ఞప్తి చేస్తున్నారు. నిర్వాహకులు పట్టించుకోక పోవడంతో ఈ వీధిలోని పాతపాలమూరు పెద్ద మసీదుకు చెందిన (ఆకాఫ్) ఏడు ఇళ్లు శిథిలమై కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. కొన్నింటికి తలుపులు, కిటికీలు ఊడిపోయాయి. దీంతో సుమారు పదేళ్లుగా వాటిలో ఎవరూ నివసించడం లేదు.

సీసీరోడ్లు అధ్వానంగా ఉన్నాయి..



మా వీధి మొత్తం లోతట్టు ప్రాంతంలోనే ఉంది. సీసీ రోడ్లు దెబ్బ తిన్నాయి. పాత డ్రైయినేజీలు చిన్నవిగా ఉండటంతో మురుగు ముందుకు కదిలే పరిస్థితి లేదు. 15రోజులకోసారి వీధులు ఊడ్చినా, చెత్తను తీసుకుపోవడానికి పారిశుద్ధ్య సిబ్బంది సరిగా రారు. సగం వరకు మట్టిరోడ్లే దిక్కయ్యాయి. కుక్కల బెడద ఎక్కువగా ఉంది. వీధి దీపాలు సరిగా వెలగవు. వర్షాకాలం కావడంతో ఎక్కడికక్కడ వరద వచ్చి గుంటల తరబడి నిలిచి పోతుంది. ఈ విషయమై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– అనురాధ, గృహిణి, శివశక్తినగర్

మురికివాడగా తయారైంది..



మా ప్రాంతం మొత్తం మురికివాడగా తయారైంది. అసలే చిన్న గల్లీలు.. ఆపై సీసీరోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. పక్క గల్లీలోనైతే 4 నెలల క్రితం మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటి సరఫరాకు పైపులైన్ కొత్తగా వేశారు. అయితే ఎక్కడికక్కడ గుంతలు తవ్వి పూర్తిగా పూడ్చి వేయకుండా సీసీ దిమ్మెలు అలాగే వదిలేశారు. కనీసం నడవడానికి కూడా ఇబ్బందిగానే ఉంది. డ్రైయినేజీలు నిర్మించకపోవడంతో ఇళ్ల నుంచి బయటకు వస్తే కంపుకొడుతోంది. శిథిలమైన ఏడు ఆకాఫ్ ఇళ్లను కూల్చివేసి కొత్తవి నిర్మిస్తే బాగుంటుంది.

– రూపేష్‌కుమార్, మేతర్‌వాడ

రూ.3 కోట్లతో పనులు చేపట్టాం..

మూడున్నరేళ్ల కాలంలో సుమారు రూ.మూడు కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం. రూ.నాలుగు లక్షలతో ముఖ్య కూడళ్లలో నాలుగు హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశాం. ఇటీవలే మరో రూ.3.5 కోట్ల విలువజేసే పనుల కోసం ప్రతిపాదనలు పంపించాం. ఈ నిధులు మంజూరైన వెంటనే వార్డులో మిగిలిన చోట్ల సీసీరోడ్లు, డ్రైయినేజీలను నిర్మింపజేస్తాం. మూడు గల్లీలలో మిషన్ భగీరథ పథకం పైపులైన్‌ను పొడిగించాం. త్వరలోనే తెలుగుగేరిలోనూ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. వీలైనంత వరకు సమస్యలన్ని పరిష్కరిస్తాం.

– తిరుపతమ్మ, కౌన్సిలర్, 23వ వార్డు

సంతలో సమస్యలపై ఆరా



నవాబుపేట సంతలో కూరగాయలు కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నవాబుపేట: పేట సంతలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆదివారం కలియదిరిగారు. రైతులు, వినియోగదారులతో మాట్లాడారు. పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. సంతకు వేలాది మంది రావటం గొప్ప విషయమని పేర్కొన్నారు. కూరగాయలు కొనుగోలు చేశారు. జెడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య పాల్గొన్నారు.

గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభం..

గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రంలోని సాయికొండపై రెండు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రారంభించారు. కాగా సోమవారం సాయి వ్రతం, పల్లకీసేవా కార్యక్రమాలు ఉంటాయని ట్రస్టీ బ్యంగి రవీందర్, దేవాలయ కార్యనిర్వహణ కార్యదర్శి అనంతకృష్ణ తెలిపారు.

వైస్‌చైర్మన్‌గా ఎంఆర్‌కే రెడ్డి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మాజీ సైనికుల సమాఖ్య రాష్ట్ర వైస్ చైర్మన్‌గా జిల్లాకు చెందిన ఎంఆర్‌కే రెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఎన్నిక నిర్వహించగా ఈయనతో పాటు జిల్లాకు చెందిన మరో ముగ్గురికి రాష్ట్ర కమిటీలో చోటు దక్కింది. ఈ సందర్భంగా ఎంఆర్‌కే రెడ్డి మాట్లాడుతూ మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు.

బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేత



సంకలమద్దిలో చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

అడ్డాకుల: కార్యకర్తల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండలం పోల్కంపల్లికి చెందిన కుర్వ రాములమ్మ, సంకలమద్దికి చెందిన కుమ్మరి రాములు మృతి చెందడంతో పార్టీ సభ్యత్వం ద్వారా చెరో రూ.2లక్షల చెక్కులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే ఆదివారం రాత్రి నేరుగా బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి అందజేశారు. అదేవిధంగా సంకలమద్ది గ్రామంలో హైమాస్టు లైట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, సర్పంచులు శ్రీకాంత్‌రెడ్డి, స్వరూప, చంద్రశేఖర్, పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహ్మ యాదవ్, నాయకులు కొండయ్య, మల్లయ్య, రవీందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట



మహమ్మదాబాద్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసిందని ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గాధిర్యాల్‌లోని ఎస్సీ కాలనీలో రూ. 5లక్షలు జెడ్పీ నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్రాంరెడ్డి, ఎంపీటీసీ రాములమ్మ, ఉపసర్పంచ్ రామకృష్ణ, హన్మయ్య, శంకరయ్య, అంజిలయ్య, రాములు, హన్మంతు, కృష్ణ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పెద్దాయపల్లి కూడలి

- రోడ్డు నిర్మాణ లోపంతో తరచూ ప్రమాదాలు



పెద్దాయపల్లి కూడలిలో ఓ లారీ యూటర్న్ తీసుకోవడంతో నిలిచిన భారీ కంటైనర్

బాలానగర్: మండలపరిధిలోని జాతీయరహదారి –44పై పెద్దాయపల్లి కూడలి ప్రమాదకరంగా మారింది. రోడ్డు నిర్మాణలోపంతో తరచూ ఇక్కడ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. జిల్లా ఎస్పీ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినా రోడ్డు నిర్మాణలోపం ప్రధాన సమస్యగా మారిందని పలువురు అంటున్నారు. నిర్మాణంలో రహదారికి ఓ వైపు 4 వరుసల రోడ్డును నిర్మించగా మరోవైపు కేవలం రెండు వరుసల దారిని మాత్రమే నిర్మించి జాతీయరహదారి అధికారులు చేతులు దులుపుకున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో ఉడిత్యాల, గుండేడ్ వైపుగా ఉన్న పదుల సంఖ్యలోని పరిశ్రమలకు వచ్చిపోయే భారీ వాహనాల రాకపోకలతో సమస్యలు తలెత్తుతున్నాయని చెబుతున్నారు. రెండు వరుసల రహదారిని పూర్తిగా ఆక్రమించి రోడ్డు యూ టర్న్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని చెబుతున్నారు. పలుమార్లు భారీ వాహనాల డ్రైవర్లు, కార్లు ఇతర వాహనదారులు కూడా అదే జాతీయరహదారిపై నిలిపి అక్కడే టిఫిన్లు, టీలు తాగుతున్న పరిస్థితి ఉంటోందని దీంతో కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని చెబుతున్నారు. వాహనాలు మితిమీరిన వేగంతో ఉండటంతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొంటున్నారు. పోలీసులు ప్రత్యేక చర్యలలో భాగంగా బారికేట్లు ఏర్పాటు చేసినా ఇబ్బందులు ఇంకా కొనసాగుతున్నాయని పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. విషయంపై రాయికల్ టోల్‌ప్లాజా అధికారులను వివరణ కోరగా జాతీయరహదారి విస్తరణలో ప్రతిపాదన పెట్టామని రెండు వైపులా ప్రధాన రోడ్డు కనీసం 6 లైన్లుగా ఏర్పాటు చేయడంతోపాటు వాహనాల యూటర్న్ కోసం అండర్ పాస్, సబ్ రోడ్డు నిర్మాణం వంటివి చేపట్టనున్నట్లు వివరించారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

అడ్డాకుల: మండలంలోని జాతీయ రహదారి నుంచి కాటవరం వెళ్లే దారిలో బీటీరోడ్డు పక్కన విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. పక్కన పొలంలో ఉన్న స్తంభం రోడ్డు వైపు ఒరిగి ఎప్పుడు కూలుతుందో తెలియడం లేదు. అసలే వర్షాకాలం మొదలై గాలులు వీచే సమయం ఆసన్నమైంది. ఈక్రమంలో ప్రమాదకరంగా ఉన్న స్తంభం ఎప్పుడు నేల కూలుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనికి కూతవేటు దూరంలోనే విద్యుత్ సబ్ స్టేషన్ ఉంది. ప్రమాదం సంభవించక ముందే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న స్తంభాన్ని సరి చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో జెడ్పీ కార్యాలయ సమీపంలో ఉన్న ద్వారకామయి బాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా ఉదయం కాగడహారతి, అభిషేకం, మహాగణపతి పూజ, అఖండ దీపారాధన, నాంది సమారాధన, అంకురారోహణం, ప్రధాన కలశపూజ, మహామంగళ హారతి, ప్రదోషకాల పూజ, సంధ్యాహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం అష్టోత్తర శతక్షీర కుంభాభిషేకం, సామూహిక సాయి వ్రతాలు నిర్వహించనున్నారు.

జడ్చర్లలో నేడు...

జడ్చర్ల టౌన్: పట్టణంలో గురుపౌర్ణమి వేడుకలు సోమవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు పట్టణంలో సాయిబాబా ఆలయాలను నిర్వాహకులు ముస్తాబుచేశారు. తెల్లవారుజామునుంచే అభిషేకాలు, పుష్పార్చన, డోలారోహణం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం



నివాళి అర్పిస్తున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

నవాబుపేట: బీఆర్‌ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడు పార్టీ అండగా ఉంటుందని ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు రాధకృష్ణ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో వారు పాల్గొని నివాళి అర్పించారు. రాధకృష్ణ లేకపోవడం తీరని లోటన్నారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపొందించాలి



జడ్చర్లలో మొక్కలు నాటుతున్న యువజన సంఘం సభ్యులు



వెన్నాచేడ్‌లో..

గండేడ్: పచ్చదనాన్ని పెంపొందించాలి వెన్నాచేడ్ సర్పంచ్ పుల్లారెడ్డి సూచించారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గ్రామంలో ఆదివారం మొక్కలు నాటారు. గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడం ఎంతో అవసరమని అన్నారు. ఏటా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. సత్యసాయి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శివమల్లప్ప, మండల కన్వీనర్ నారాయణ్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, నాగేందర్‌కుమార్, పులీందర్‌రెడ్డి, గౌరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: పట్టణంలోని డిగ్రీకళాశాల ప్రాంగణంలోని బొటానికల్ గార్డెన్‌లో ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా సత్యసాయి యువజన సంఘం విభాగం వలంటీర్లు మొక్కలు నాటారు. సత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో ప్రేమ తరువు పేరుతో కార్యక్రమం చేపట్టామని కో ఆర్డినేటర్ శారద తెలియజేశారు. గార్డెన్ సమన్వయకర్త డా.సదాశివయ్య, సత్యసాయి సేవాసంస్థల ఆధ్యాత్మిక కన్వీనర్ రమేష్, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రక్షణగోడ నిర్మించండి



రక్షణ గోడ లేని కల్వర్టు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని జానంపేట వద్ద జాతీయ రహదారి పక్కన కొన్నాళ్ల కిందట సర్వీస్ రోడ్డుపై బీటీ వేయించి బాగు చేయించారు. ఇంతవరకు బాగానే ఉన్నా రైస్ మిల్లు సమీపంలో సర్వీస్ రోడ్డు వద్ద ఉన్న కల్వర్టుకు ఒకవైపు మాత్రమే రక్షణ గోడ ఉంది. మరోవైపు రక్షణ గోడ లేదు. దీంతో జాతీయ రహదారి నుంచి జానంపేట ఊర్లోకి సర్వీస్ రోడ్డుపై మళ్లే వాహనాలకు కల్వర్టు వద్ద ప్రమాదం పొంచి ఉంది. హైవేను దిగి వచ్చే సమయంలో డ్రైవర్లు ఏమాత్రం అజాగ్రత్త ఉన్నా కల్వర్టులో పడిపోయే అవకాశం ఉంది. దీంతో ఇప్పటికైనా రహదారి నిర్వాహకులు స్పందించి రక్షణ గోడ నిర్మించాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

జాతీయ సదస్సులో భీంపల్లి శ్రీకాంత్



ప్రశంసా పత్రం అందుకుంటున్న శ్రీకాంత్

స్టేషన్ మహబూబ్‌నగర్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో తెలుగు విశ్వవిద్యాలయం శ్రీశైలం శాఖ, సాహితీలహరి విజయవాడ సంయుక్త నిర్వహణలో ఆదివారం జరిగిన జాతీయ సదస్సులో జిల్లాకు చెందిన ప్రముఖ కవి డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు. 'శ్రీశైల క్షేత్ర వైభవం' పేరిట శ్రీశైలంలో నిర్వహించిన జాతీయ సదస్సులో భీంపల్లి శ్రీకాంత్ 'ప్రాచీన సాహిత్యంలో శ్రీశైల క్షేత్ర ప్రస్తావన' అంశంపై పత్రసమర్పణ చేశారు. ఇందులో శ్రీశైలం పుట్టు పూర్వోత్తరాలు, వేదాలు, పురాణాలలో, శాసనాలు, కావ్యాలలో ఉన్న శ్రీశైల క్షేత్ర ప్రస్తావనను తెలియజేశారు. అనంతరం భీంపల్లి శ్రీకాంత్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయశాఖ అర్చక పరిషత్ సంచాలకులు డాక్టర్ వేదాంతం రాజగోపాల చక్రవర్తి, దేవస్థానం సహాయ కార్యనిర్వాహణాధికారి ఎం.హరిదాసు మెమొంటో, ప్రశంసాపత్రంతో సత్కరించారు.